# యుగాంతం

## నెల్లూరి కేశవస్వామి

**కే**శవస్వామి 1920లో హైదరాబాద్‌లో జన్మించారు. నీటిపారుదల శాఖలో ఇంజనీరుగా పనిచేశారు. కేశవస్వామి "చార్మినార్" కథల సంపుటి చాలా ప్రసిద్ధి చెందింది. ఈ సంపుటికి రాష్ట్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించింది. వీరి మరో కథా సంకలనం "పసిడిబొమ్మ". వెలుతురులో చీకటి వీరు రచించిన నవల. యుగాంతం కథ హైదరాబాద్ విమోచన నేపథ్యంలో రాశారు. రచనా కాలం 1948. ఆనాటి వాతావరణాన్ని కళ్లకు కట్టినట్లు చూపించారు. కాలక్రమంలో సత్యాలు వక్రీకరణ చెందవచ్చునేమో గాని, అదే సమయంలో దాదాపు ప్రత్యక్ష వ్యాఖ్యానంలా సాగిన యీ కథాంశంలో నిజాయితీని శంకించాల్సిన పనిలేదు. నాటి రజాకార్ అరాచకాలతో బాటు, తరువాత అధికారం చేపట్టిన వారి అరాచకాలను కూడా బయటపెట్టారు కేశవస్వామి. తెలుగు సంవత్సరాది శుభవేళ, యీ చక్కని తెలుగు కథను మా పాఠకులకు అందిస్తున్నాము.

**ప**దిహేను సెప్టెంబర్, పందొమ్మిది వందల నలభై ఎనిమిది... 'పోలీస్ యాక్షన్' మొదలై ఆనాటికి మూడో రోజు.

మేము హైద్రాబాద్ నగరంలో చాటుమాటుగా, వాల్యూం బాగా తగ్గించి "ఆల్ ఇండియా రేడియో" వింటున్నాం. భారత సైన్యాలు నలువేపుల నుండి హైద్రాబాద్ రాష్ట్రంలోకి జొచ్చుకు వస్తున్నాయి. ముఖ్యంగా తూర్పు దిశకు విజయవాడ నుంచి, పడమరలో షోలాపూర్ నించీ బయలుదేరిన సైనిక దళాలు హైద్రాబాద్ నగరానికి దాదాపు యాభై మైళ్ళ దగ్గరగా వచ్చేశాయి. రేపోమాపో నగర ప్రవేశం చెయ్యొచ్చు. తక్కిన వైపుల నుండి వచ్చే దళాలు అట్టే చురుకు చూపడంలేదు. కారణం అనూహ్యం.

హైద్రాబాద్ ప్రత్యేక ప్రసార కేంద్రం "దఖన్ రేడియో" లోంచి రాత్రింబవళ్ళు, ఎడతెరిపి లేకుండా ప్రసారాలు వస్తున్నాయి. వీటి ప్రకారం హైద్రాబాద్ సైన్యాలూ, ఇత్తెహాదుల్ ముసల్మీన్ రజాకార్ (స్వచ్ఛంద) దళాలూ కలిసి, భారత సైన్యాల్ని తరిమి కొట్టేస్తున్నాయి. వాళ్ళ ధైర్యసాహసాల్ని పొగడ్తూ, భారత ప్రభుత్వాన్ని అనేక రకాలుగా తిట్టిపోస్తూ, పాటలూ, పద్యాలూ, ఉపన్యాసాలతోనూ 'ఖాసింరజ్వీ జిందాబాద్!', 'ఆజాద్ హైద్రాబాద్ జిందాబాద్!' అన్న నినాదాలతోనూ, హోరెత్తించేస్తోంది రేడియో.

కాని హైద్రాబాద్ నగరం మాత్రం ప్రశాంతంగానే ఉంది. ఆఫీసులూ, స్కూళ్ళూ, కాలేజీలూ, దుకాణాలూ తెరిచే వున్నాయి. ప్రజల దినచర్యల్లో చెప్పుకోదగ్గ మార్పేమీ రాలేదు. హిందువులు భయం భయంగా బిక్కుబిక్కుమంటూ, వంచిన తలలు ఎత్తకుండా, మౌనంగా తమ తమ పనులు చేసుకుంటూనే వున్నారు. సాయంత్రం కాగానే మాత్రం దుకాణాలన్నీ, ముఖ్యంగా హిందువులవి మూతపడిపోయేవి. రోడ్లంబటి ఒక్క హిందువూ కనిపించేవాడు కాదు. ముస్లింలు మాత్రం బాహాటంగా తిరుగుతూ వుండేవారు.

ఈ విపరీత వాతావరణం ఈ మూడు రోజులే కాదు, దాదాపు సంవత్సరం నుంచి అంటే భారతదేశా

## ఆణిముత్యాలు

నికి స్వాతంత్ర్యం లభించాక, నిజాం నవాబు హైద్రాబాద్‌ను స్వతంత్ర రాష్ట్రంగా ప్రకటించినప్పటి నుంచీ, ఇలాగే వుంటోంది. జిల్లాల్లో అక్కడక్కడ, అప్పుడప్పుడు రజాకార్లూ పోలీసులూ కలిసి, బలవంతానైనా హిందువులను స్వతంత్ర రాష్ట్రానికి అనుకూలంగా మార్చాలన్న ఉద్దేశంతో, పల్లెలపై కాకిదాడి చేసి, హత్యలూ, దోపిడీలూ, స్త్రీల మానభంగాలూ లాంటి దారుణ హింసాకాండలు జరుపుతున్నారని వింటూనే వున్నాం. కాని నగరంలో మాత్రం గంభీర వాతావర

ణం, చెదురుమదురు సంఘటనలు తప్ప హింసాకాండలు జరిగేవి కావు. ప్రజానాయకుల్లోనూ, ధనవంతుల్లోనూ, చాలామట్టుకు పారిపోయి రాష్ట్రేతర ప్రదేశాల్లో సురక్షితంగానే వుండిపోయారు. కొందరు, ఆడవాళ్లను మాత్రం నగలతో సహా బయటికి, బంధువుల ఇళ్ళల్లోకి చేర్చేశారు. మాలాంటి సాధారణ ప్రజానీకం ఎటూ పోలేక, వూపిరి బిగబట్టి, ఇక్కడే వుండిపోయారు.

మా ఇంట్లో నేనూ, అమ్మ మాత్రమే వుండేవాళ్ళం. హిందూ వాడలోనే ఉంది ఇల్లు. కాని కొద్ది దూరంలో ఒక మస్జిద్ కూడా ఉంది. దాని చుట్టూ కొన్ని ముస్లింల ఇళ్ళు వున్నాయి. అప్పటిలో అవి పాముపుట్టల్లా కనిపించేవి మా కళ్ళకి.

ఆఫీసులో మాది ఇంజనీరింగు శాఖ. ఎక్కువ హిందువులే వుండేవాళ్ళు. అయినా, ఆఫీసరూ, క్లర్కులూ, చప్రాసీలూ (బంట్రోతులు) అంతా ముస్లింలే. దాంతో ఆఫీసులో రాజకీయాలు చర్చించుకునే ధైర్యం మాకుండేది కాదు. ముస్లిం క్లర్కులు, ఉర్దూ పత్రికల్లో భారత ప్రభుత్వాన్ని, ముఖ్యంగా సర్దార్ పటేల్ని తెగ తిడుతూ రాసిన రాతలన్నీ గట్టిగా చదువుతోంటే, వినీ విననట్లు మా పనేదో మేము చేసుకుంటూ కూచునే వాళ్ళం.

నా తోటి ఇంజనీర్లలో ఇద్దరు ముస్లిమ్‌లు కూడా వుండేవాళ్ళు. ఒకడు, లోలోపల పక్కా రజాకార్ అని తెలుసు. వాడికి దూరంగానే వుండేవాణ్ణి. రెండోవాడు నా సహపాఠి కూడాను. కొంచెం కమ్యూనిజం భావాలు గలవాడు. నిజాంనూ, అతని యాజమాన్యంలో సాగుతోన్న జమీందారీ నిరంకుశ వ్యవస్థనూ విమర్శిస్తూండే వాడు. అతని ఎదుట మాత్రం అప్పుడప్పుడు నా మనస్సులోని మాట వెళ్ళగ్రక్కుతూ కాస్త తేలిక పడేవాణ్ణి.

'పోలీస్ యాక్షన్' మొదలైందని తెలియగానే రొమ్ము మీది పెద్ద బరువు తీసేసినట్టనిపించింది. ఇక కొద్ది రోజుల్లోనే బంధవిముక్తులమవుతామన్న సంతోషంతో ఉప్పొంగిపోయాం. కాని, వెంటనే మరో భయం ఆవరించింది. ఇంతవరకు శాంతంగానే వున్న ముస్లింలు అటు భారత సేనలు దెబ్బమీద దెబ్బ తీస్తోంటే, తట్టుకోలేక, గదిలో బంధించిన పిల్లిలా, మాపైన ఎక్కడ విరుచుకుపడతారోనని భయంగా వుంది. వాళ్ళ దగ్గిర ఆయుధాలున్నాయి. పోలీసు బలగం వెనుక వుంది. మేము నిరాయుధులం. దినమొక గండంగా, రాత్రిళ్ళు మహాగండంగా గడుస్తున్నాయి.

ఆ రోజు మూడో రోజు కూడా ఆఫీసు కెళ్ళొచ్చాను. రాగానే తలుపులు బిగించేసి, కిటికీలన్నీ మూసేసి రేడియో దగ్గిర చెవి పెట్టి కూచున్నాను. అమ్మకూడా కూచుంది దిగాలుగా. నేను వింటున్న వార్తల సారాంశాన్ని చెబుతూ, నా భయాన్ని నాలోనే దాచుకుని, అమ్మకు ధైర్యం చెబుతున్నాను.

నాకు ఆకలిగా లేకున్నా, అమ్మ బలవంతం మీద పెందరాళె భోంచేశాం. అమ్మ పడుకుంది. పూర్వమైతే నిద్రవచ్చేదాకా ఏవేవో కీర్తనలను పాడుకుంటూ వుండేది. ఇప్పుడవన్నీ మానుకుంది. మనసులోనే ప్రార్థించుకుంటుందేమో కొద్దిసేపట్లోనే నిద్రపోయింది.

నాకు నిద్ర రావటం లేదు రేపేమవుతుందో తెలీక. ఒకవైపు సంతోషమూ, మరోవైపు దిగులుతో కొట్టుమిట్టాడుతున్నాను. లేచొచ్చి రేడియో దగ్గిర కూచున్నాను. వార్తల్లోనూ, సంగీతంలోనూ నా భయాల్ని పారతోలటానికి ప్రయత్నం చేస్తూ... రాత్రి పదిగంటలప్పుడు ఎవరో పిలుస్తూన్నట్టనిపించింది. చప్పున రేడియో ఆపేశాను.

"స్వామీ!..." అన్న పిలుపు వినిపించింది.

ఒక్కసారి ఉలిక్కిపడ్డాను. భయంతో వొళ్ళంతా రోమాంచితమై పోయింది. గుండె దడ హెచ్చింది.

ఎవరు?... ఎవరై వుంటారు?... హిందువులెవ్వరూ ఇళ్ళు వదిలి రావటంలేదు. ముస్లిం స్నేహితులెవరొస్తారూ? అదీ ఇంతరాత్రి?

"స్వామి సాబ్!..." మళ్ళీ పిలుపు. పరిచిత కంఠం లాగే వుంది. కాని ఎవరో పోల్చుకోలేక పోతున్నాను.

"ఎవరు?" అంటూ హాల్లోకి వెళ్ళాను. ఎదురుగా అమ్మ. ఇంకా నిద్రపోలేదేమో, గాబరాగా "ఎవర్రా అదీ?" అంటూ దగ్గరకొచ్చింది.

"ఎవరో నన్ను పిలుస్తున్నారమ్మా, తెలిసిన వాడి లాగే వుంది."

"వొద్దు, తలుపు తీయకు, రోజులు మంచివి కావు."

"తియ్యను, కాని ఎవరో ముందు కనుక్కుంటాను" అంటూ తలుపు దగ్గిరికెళ్ళి, కొంచెం ధైర్యంగానే "ఎవరదీ?" అన్నాను.

"నేను... నేను స్వామీ! దిలావర్‌ని... దిలావర్ హుసేన్"

దిలావర్? నా పాత మిత్రుడు దిల్లూ...? అవును, అతని కంఠమే అది.

"అమ్మా! దిలావార్!" దిల్లూ... నా స్నేహితుడు

నీకు తెలుసుగా..."

"అయినా తలుపు తీయకు, ఎవర్నీ నమ్మటానికి లేదు."

"లేదమ్మా, వాడే అయితే, ఏ భయమూ లేదు... వుండు వొక్కడే వచ్చాడో, వెంట ఎవరైనా వున్నారో చూస్తాను అంటూ, హాల్లో లైటార్పి మెల్లిగా కిటికీ గడియ తీసి ఒక రెక్క కొద్దిగా తెరిచి, పొంచి చూశాను. బైట స్ట్రీటు లైట్లు దేదీప్యమానంగా వెలుగుతున్నాయి. ఇంటి ముందు ఒకే ఒక్క ఆకారం నిలుచుని ఉంది. శేర్వానీ పైజామాతో వున్నాడు. తలకు టోపీలేదు. మొహం స్పష్టంగా కనిపిస్తోంది. దిలావరే. నాకు బాగా ధైర్యమొచ్చేసింది.

"దిలావర్! నువ్వా?... ఇప్పుడు?... ఇంత రాత్రి?..."

"అవును, నేను తలుపు తెరువు."

"ఎక్కడి నుండి వస్తున్నావు?"

"చెబుతా, ముందు తలుపు తీయ్"

కిటికీ తలుపు మూసేసాను. హాల్లో లైటు వేశాను.

"అమ్మా! మరేం భయంలేదు. దిలావరే... వంటరిగానే వచ్చాడు. చేతిలో కర్రగానీ, కత్తిగానీ లేదు... తలుపు తెరుస్తాను... నువ్వెళ్ళి పడుకో" అంటూ తలుపు దగ్గిరికి నడిచాను. అమ్మ వెళ్ళలేదు. అక్కడే నిలుచుంది. బిక్కచచ్చి చూస్తూ.

తలుపు తెరిచాను. లోపలికి అడుగుపెట్టగానే అమాంతం నన్ను కావలించుకుని వెక్కి వెక్కి ఏడ్వటం మొదలుపెట్టాడు. నేను ఉక్కిరిబిక్కిరి అయ్యాను. అమ్మ తలుపు వేసి, గడియ పెట్టేసింది.

"దిల్లూ! ఏఁవిటిది? ఎందుకేడుస్తున్నావ్?" వీపు మీద మెల్లిగా తడుతూ అడిగాను.

"నాశనం... సర్వనాశనమై పోయింది."

"ఏమిటి?"

"మన రాష్ట్రం మట్టిపాలైపోయింది. యూనియన్ వాళ్ళు వచ్చేస్తున్నారు. రేపటి వరకు ఇక్కడికి కూడా వచ్చేస్తారు... నిజాంగాడు లొంగిపోయాడు.

ఆ చివరి మాట వినగానే నా హృదయం ఆనందంతో పరవశించిపోయింది. "రా... రా, ఇలా వచ్చి కూచో" అంటూ డ్రాయింగు రూంకేసి నడిపించాను.

దిలావర్ దృష్టి అమ్మమీద పడగానే, "అమ్మా! నేను... దిల్లూను... నాకు ఆకలిగా వుందమ్మా" అన్నాడు దీనంగా.

అమ్మ కళ్ళు మెరిశాయి. కరుణతో నిండిపోయాయి. "ఇప్పుడే తెస్తాను. నువ్వు చేతులు కడుక్కో" అంటూ లోపలికెళ్లింది.

అప్పుడు గమనించాను. వాడు వేసుకున్న గుడ్డలు మట్టి గొట్టుకుపోయాయని, కాళ్ళకు చెప్పులు కూడా లేవని, జుత్తంతా రేగి వుందని. వెంటనే వెళ్ళి నావి చలవ చేసిన కుర్తా, పైజామా తెచ్చి ఇచ్చాను. దిలావర్ మొహం కాళ్లూ చేతులూ కడుక్కుని, బట్టలు మార్చుకున్నాడు. వచ్చి సోఫాలో కూచున్నాడు. నేనూ ప్రక్కనే కూచున్నాను.

అమ్మ ఒక పళ్ళెంలో అన్నం కూరలూ, నీళ్ళగ్లాసూ తెచ్చి పెట్టింది. అది చూడగానే ప్రాణం లేచి వచ్చినట్టు గబగబా తినటం మొదలుపెట్టాడు. నేనూ, అమ్మా మౌనంగా అతన్నే చూస్తున్నాం. అన్నం అయిపోయాక గటగటా నీళ్ళు తాగాడు.

అమ్మ అడిగింది. "ఆకలి తీరిందా?... ఇంకా కావాలంటే వంట చేస్తాను."

"వొద్దు వొద్దు, చాలు ఆఁ మరో గ్లాసు నీళ్ళు."

అమ్మ తెచ్చింది. తాగేశాడు. అమ్మ పళ్ళెమూ, గ్లాసూ తీసుకెళ్తూంటే నేను అన్నాను. "అమ్మా! దిలావర్‌కు నా గదిలోనే పక్క వెయ్యి... నువ్వు వెళ్లి పడుకో"

అమ్మ వెళ్లిపోయింది.

అప్పుడు అడిగాను. "ఊఁ చెప్పు ఏఁవిటీ హడావిడి? ఎక్కడ్నించి వస్తున్నావు."

"నేనెక్కడుంటున్నానో నీకు తెలీదా?"

"...మనం కలుసుకుని ఆర్నెల్లయింది. అప్పుడు నువ్వు నల్లగొండలో టెక్స్‌టైల్ డిపార్ట్‌మెంట్‌లో వుండేవాడివి."

"ఇప్పుడూ అక్కడే వున్నాను. కాదు, వుండేవాణ్ణి ఇవాళ్ళ ప్రొద్దుటి వరకూ."

"మరేమైంది?"

"నిన్న రాత్రి, అర్ధరాత్రి యూనియన్ సైన్యం నల్లగొండలోకి వచ్చేసింది... ఇహ గత్యంతరం లేక నేను వున్న పళంగా ఇల్లు వదిలేసి, పారిపోయి వచ్చాను. అయిదారు మైళ్ళు పరుగెత్తాను. ఒక లారీ కనిపిస్తే బ్రతిమాలి ఎక్కాను. ఓ ఇరవై మైళ్ళు వచ్చేసరికి లారీ ఫేలయింది. మళ్ళీ పరుగు. ఇంకో లారీ కనిపించింది. వాడికో పది రూపాయలిచ్చి ఎక్కాను. వాడు పట్నం పొలిమేర్లలో దించేశాడు. అక్కడ్నించి నడిచి నీ దగ్గరికొచ్చాను.

"మరి నీ భార్యో?"

వాడి మొహంలో ఒక్కసారి మార్పు వచ్చేసింది.

కాసేపు మాట్టాడలేదు. తర్వాత, "భార్య...? భార్య సంగతి అడక్కు తర్వాత చెబుతాలే" అన్నాడు.

"అది సరే, మరి నువ్వెందుకు పారిపోయి రావటం?"

"ఎందుకేంఁవిటి, యూనియన్ సైన్యం వచ్చేసిందని చెప్పాగా?"

"వస్తే?... నిన్నేమంటారు?"

"వాళ్ళుకాదు వాళ్ళ అండ చూసుకుని అక్కడి హిందువులు నా మీద పడ్డారు. చీల్చి చెండాడ్తారు."

"ఎందుకూ?... నువ్వేం చేశావనీ?"

"అయితే నా గురించి నీకేం తెలీదన్నమాట. నేను... నేను రజాకార్‌ని."

నేను చకితుణ్ణయాను. "నువ్వు రజాకార్‌వా... నేను నమ్మలేను... ప్రభుత్వోద్యోగివా...?"

"ప్రభుత్వోద్యోగులకీ రజాకార్‌లకీ తేడా ఏంఁవిటి? ఇక్బాల్ సంగతి వినలేదూ?"

"ఏ ఇక్బాల్? మన హాకీ ప్లేర్ ఇక్బాల్ అహమద్... బీబీనగర్‌లో డిప్యూటీ కలెక్టర్‌గా వున్నాడు. అతనేనా... ఆఁ విన్నాను."

"అతనే మా ప్రాంతానికంతా నాయకుడు, ఉపనాయకులం మేము, నల్లగొండ చుట్టుప్రక్కల జరిగే దాడులన్నీ నా ఆధ్వర్యంలో జరిగేవి..."

నా వళ్ళు జలదరించింది. నా ఎదుట కూచున్నది మనిషి కాదేమో క్రూరమృగమేమో ననిపించింది. హీన స్వరంతో అడిగాను, "ఎందుకు ఎందుకలా చేశావు?"

"ఎందుకేంఁవిటి, ఆ దుర్మార్గుడి కోసం, అంతా వాడికోసమే"

"వాడెవడు?"

"అదే, నిజాం... మమ్మల్ని నట్టేటముంచి ఇప్పుడు నాకేమి తెలీదు, అంతా ఖాసింరజ్వీ చేయించాడు, అని బొంకుతూ యూనియన్ వాళ్ళ కాళ్లు పట్టుకుంటున్నాడు వెధవ!"

నేను జంకుతూనే అడిగాను, "అది అబద్ధమా?"

"పచ్చి అబద్ధం! రేపు నిజంగానే హైద్రాబాద్ రాష్ట్రానికి స్వతంత్రం వచ్చి వుంటే ఒరిగేదెవరికి? వాడు గద్దె దిగిపోయేవాడా. ఖాసిం రజ్వీకి పట్టం కట్టేవాడా?"

ఇహ వీడిని ఏదడిగినా ఇంకా రెచ్చిపోతాడేమోనని గ్రహించి, నెమ్మదిగా, "లే దిల్లూ! నువ్వు బాగా అలసి పోయి వుంటావు. మనం మళ్ళీ మాట్లాడుకోవచ్చు. పద, పడుకుందాం" అన్నాను.

దగ్గరికొచ్చాడు. జేబులు తడిమి, కర్చీఫ్‌లో కట్టిన ఒక మూట తీసి నాకివ్వబోయాడు. ఏంఁవిటన్నట్టు చూశాను.

"ఇందులో కొంత డబ్బూ, నగలూ వున్నాయి" అని తగ్గు స్వరంలో అన్నాడు.

నాకు భయం వేసింది, "నాకెందుకూ?"

"దాచు రేపు ఎటుపోయి ఎటొస్తుందో తెలీదు. నన్ను ఏ క్షణాన్నైనా పోలీసులు పట్టుకోవచ్చు. అప్పుడది నీ దగ్గర సురక్షితంగా వుందన్న తృప్తి నాకుంటుంది.

"కానీ... కానీ..."

"భయపడకు... నీ మీదికేమీ రాదు. నిన్నడిగితే 'నాకేమీ తెలీదు. నాకేమీ ఇవ్వలేద'ని చెప్పు."

నేనింకా సంకోచిస్తూనే వున్నాను. తీసుకోలేదు ఆఖరికి, "ఉహూఁ క్షమించు దిల్లూ, నేనలాంటి అబద్ధాలు ఆడలేను" అన్నాను.

కొద్ది క్షణాలు నాకేసే చూసి అన్నాడు, "సరే, ఆడకు, నీ ఇష్టం వచ్చినట్టు చెప్పు, ప్రస్తుతానికైతే

## స్వాతంత్ర్య వజ్రోత్సవ గీతం

సంబరం! సంబరం! స్వాతంత్ర్య వజ్రోత్సవ సంబరం!!
వందనం! వందనం! మన భరత మాతకు వందనం!!

మనమెగరేసే జాతి పతాకం
పింగళి వెంకయ్య చేసిన రూపం
కాదోయ్ కాదది సాదా వస్త్రం
భారతీయుల గౌరవ వస్త్రం ॥సంబరం॥
మన మాలపించు జాతీయ గీతం
మన విశ్వకవి ఠాగూరు విరచితం
మన మనుభవించు ఈ స్వాతంత్ర్యం
మహనీయులందరి త్యాగఫలం ॥సంబరం॥
వేరు వేరు మన భాషలు వేషం
కుల మతములు కనిపించు అనేకం
అయినా ఉన్నది మనలో ఏకత్వం
అదియే మన సాంప్రదాయం ॥సంబరం॥
ఎందరో మహానుభావుల జననం
కలిగిన పుణ్యభూమీదేశం
అందరికీ పాదాభివందనం
అంబర చుంబిత సంబరసంభ్రమం ॥సంబరం॥

-ముగడ రామకృష్ణ

కథా సాహిత్యం ★ ★ శ్రీకాకుళం

దాచు."

తీసుకుని ముడి విప్పబోయాను. వారించాడు. "వొద్దొద్దు. విప్పకు, నీ మీద నాకు పూర్తి నమ్మక ముంది. అందుకే ఇక్కడికొచ్చాను."

మారు మాటాడకుండా తీసికెళ్ళి అల్మరా సొరుగులో దాచి, తాళం వేశాను.

పడుకున్న మరుక్షణం దిలావర్ నిద్రలోకి జారుకున్నాడు. నాకు చాలా సేపటి వరకు నిద్రపట్టలేదు. ఒకటే ఆలోచన్లు...

దిలావర్ నాకు చిన్ననాటి స్నేహితుడు. నా సహపాఠి కాకపోయినా, ఒకే బస్తీలో వుండేవాళ్ళం. ఆటల్లో పరిచయమై, మంచి స్నేహంగా మారింది. అది మేము యూనివర్శిటీలో చేరాక ఒకే హాస్టల్లో ప్రక్కప్రక్క గదుల్లో వుండటం మూలాన మరీ పెరిగింది. నేను అతని ఇంటికి వెళ్ళటం, అతను మా ఇంటికి రావటమూ జరుగుతూండేది. అప్పుడే అమ్మతో కూడా

## భరించువాడు!

భార్యామణి తీరుబడిగా / పొరిగింటావిడతో
అప్పటికి అరగంటనుంచి
వంటకాల నుంచి / బోన్సాయ్ మొక్కల
పెంపకాల దాకా / గుక్క తిప్పుకోకుండా
జోరుగా హుషారుగా / నాన్‌స్టాప్‌గా సెల్‌ఫోన్‌లో
ఏకబిగిన సంభాషిస్తున్నది!

గుండె బేజారైన / ఆమె భర్త పాపం
సెల్ బిల్లును తలచుకొని
బీపీ పెంచుకుంటున్నాడు
పాపం అతను మాత్రం
అంతకంటే / ఇంకేం చేయగలడు
నోరు విప్పి ఆమెను / ఏమీ అనలేడు కదా
అని మనలేడు కదా!
భార్య సెల్లు బిల్లు / భరించేవాడే కదా భర్త!

## చొరబాటు

బంగారాన్ని ఒరిపిడి చేసి చూసే
గీటురాయికి కొద్దిగా / బంగారం అంటుతుంది
కవిత్వాన్ని తూచే విమర్శకుడి
వచనంలోనూ కొద్దిగా / కవిత్వం చొరబడుతుంది!

-ఏ. సూర్యప్రకాశ్

పరిచయం అయింది. మా ఇంటిలో బాగా చనువు ఏర్పడింది. దిలావర్ తల్లిదండ్రుల్ని చిన్నప్పుడే కోల్పోయాడు. మేనమామల ఇంటిలో పెరిగాడు.

యూనివర్శిటీలో ఇక్బాల్ అహమద్ పరిచయమైంది. హాకీలో మేటి ఆటగాడు. అంతకంటే ఎక్కువ మాటకారి. దాంతో ఒక చిన్న ఆటగాళ్ళ బృందానికి లీడరయ్యాడు. ఆ భజన బృందంలో ఎక్కువమంది ముస్లింలూ, కొద్దిమంది హిందువులూ వుండేవాళ్ళు. ఆ బృందంలో నేను చేరలేదు. దూరందూరంగానే వుండేవాణ్ణి. అందుకేనేమో నన్ను కొంచెం గౌరవంగానే చూసేవాడు ఇక్బాల్.

యూనివర్శిటీ చదువు అయిపోయాక ఇక్బాల్ హైద్రాబాద్ సివిల్ సర్వీస్‌లో సెలెక్ట్ అయి రెవెన్యూ డిపార్టుమెంటులో చేరాడు. క్రిందటి సంవత్సరం నుంచీ బీబీనగర్‌లో డెప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్నాడు. అక్కడే అతను జరిపించిన క్రూరత్వాల గాథలు అనేకం వినిపించాయి. రజాకార్లనీ, పోలీసుల్నీ వెంటేసుకుని తన హయాంలో వున్న గ్రామాల మీదికి దాడిచేసి, కొల్లగొట్టించేవాట్ట. ఒకసారి ఇరవై ఇద్దరు యువకుల్ని చేతులు విరిచి వెనక్కు కట్టించి వరుసగా నిలబెట్టి స్వయంగా కాల్చి చంపాట్ట. ఆ వార్త రాష్ట్రేతర పత్రికలలో చదివినప్పుడు నా కళ్ళని నేనే నమ్మలేకపోయాను. నాకు తెలిసిన ఇక్బాలేనా అని విస్తుపోయాను.

దిలావర్ బి.ఎ. అయిపోగానే, మొదట రేషనింగ్ డిపార్ట్‌మెంట్‌లోనూ, ఆ తర్వాత టెక్స్‌టైల్ డిపార్ట్‌మెంట్ లోనూ చేరాడు. క్రిందటి సంవత్సరం నల్లగొండలో పోస్టింగ్ అయిందని చెప్పాడు. అక్కడే ఇక్బాల్ పరిధిలోకి వచ్చినట్టున్నాడు. కాని అతనిలాగా ఇతనూ దౌర్జన్య కార్యక్రమాలలో పాల్గొన్నాడంటే ఇప్పటికీ నమ్మలేకుండా వున్నాను. తన నోటే చెబుతున్నాడు. కాబట్టి నమ్మక తప్పదు. మతోన్మాదంలో చెడ్డవాళ్ళతో బాటు మంచివాళ్లు కూడా కొట్టుకుపోయారన్నమాట.

దిలావర్‌కు యూనివర్శిటీలో వుండగానే పెళ్ళయిపోయింది. మా ఫిజికల్ డైరెక్టర్ బంధువుల ఇంట్లో ట్యూషన్ చెప్పటానికి వెళ్ళేవాడు. అక్కడే ఓ అమ్మాయితో ప్రేమకలాపం జరిపించాడు. అది పెళ్లిదాకా దారితీసింది. ఆ పెళ్ళి దిలావర్ మామయ్యలకు ఎంతమాత్రం ఇష్టంలేదు. ఇంటిలోనుంచి తరిమేశారు. నానా అవస్థలూ పడ్డాడు. నేను అప్పుడప్పుడు వెళ్లి వస్తూ వుండేవాన్ని. అతని భార్య నా ముందరికెప్పుడూ రాలేదు. కాని లోపల్నించి టీలూ, కిళ్ళీలూ పంపిస్తూం

డేది. ఒకసారి అమ్మను తీసికెళ్ళాను. చాలా అందంగా వుంటుందని చెప్పింది అమ్మ... మరి ఇప్పుడెక్కడుందో? ఆ మాట ఎత్తితేనే వాడి ముఖం కవళికలు మారాయి. ఏమైందో ఏమో...

నాకు నిద్ర ఎప్పుడు పట్టిందో తెలీనేలేదు. ప్రొద్దున లేచేసరికి దిలావర్ ప్రక్కమీద కూచుని వున్నాడు. ముందర టీ కప్పు పెట్టి వుంది. అంటే అప్పటికే అమ్మ లేచి టీ చేసిచ్చిందన్నమాట. నేనూ లేచి కాల కృత్యాలు తీర్చుకుని, టీ తాగి ఆత్రంగా వెళ్ళి రేడియో ఆన్ చేశాను.

దఖన్ రేడియోలో ఒక పెద్ద మార్పు కనిపించింది. నిన్నటి వరకూ జరుగుతూన్న ఉద్రేకపూరితమైన ప్రసారాలేవీ లేవు. విషాద సంగీతం వినిపిస్తోంది. మధ్య మధ్య వార్తలూ, ప్రకటనలూ, హెచ్చరికలూ వినిపిస్తు న్నాయి. నిజాం ఓటమి ఒప్పేసుకున్నాట్ట. ఇవ్వాళ మధ్యాహ్నానికే భారత సైన్యాలు నగర ప్రవేశం చేస్తాయట. ప్రజలంతా ప్రశాంతంగా వుండాలి. అల్లర్లు రేపిన వారికి కఠినశిక్ష విధిస్తామని పదే పదే హెచ్చ రిస్తున్నారు. ఇవ్వాళ రాత్రికి మేజర్ జనరల్ చౌదరి, నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్ రేడియోలో ప్రసంగిస్తా రని కూడా చెప్పారు.

అంతసేపూ నేను దిలావర్‌నే గమనిస్తున్నాను. తల దించుకొని మౌనంగా వింటున్నాడు. అతని కళ్ళెంట బొటబొటా కన్నీళ్లు కారటం చూసి, చలించిపోయాను. జాలి వేసింది. వెంటనే రేడియో ఆపేశాను. అతన్ని లేపి, "పద నాష్తా చేద్దాం" అంటూ తీసికెళ్ళాను.

ఆ రోజు శుక్రవారం శలవుదినం. మంచిదే అయింది. ఆఫీసుకు వెళ్ళాల్సిన పనిలేదు. ఇంట్లోనే వుండొచ్చు. కాని నా దగ్గరికే హిందూ స్నేహితులు ఎవరైనా రావచ్చు. అందుకని, నాష్తా చేసిన తర్వాత, దిలావర్‌ని తిన్నగా బెడ్‌రూంలోకి తీసికెళ్ళాను.

"ఏవిటీ?"

"అదే, నీ భార్య... ఎక్కడుంది?"

"...అక్కడే వుండి వుంటుంది... ఆజంపురాలో"

"మరి నువ్వు అక్కడికెందుకు వెళ్ళలేదు"

"హు! అంత తెలివితక్కువవాణ్ణనుకున్నావా? ఈపాటికి నాకోసం గాలిస్తూ వుంటారు. అక్కడికీ, మా మాంవయ్య ఇంటికీ వెళ్ళే వుంటారు. ఈ మధ్య ఈ ఇంటికెప్పుడూ రాలేదు నేను. కాబట్టి ఇక్కడికెవరూ రారని నా నమ్మకం... అయినా ఇక్కడ కూడా ఆట్టే వుండనులే, భయపడకు."

"ఎక్కడికెళ్తావు?"

"ఏమో, చెప్పలేను. ఇంక ఆలోచించలేను. కాని ఒక్కటిమాత్రం నిశ్చయించుకున్నాను. వీళ్ళ చేతుల్లో చిక్కకూడదు."

నేనేమీ మాట్లాడలేదు.

"ఆం స్వామీ! ఒక పనిచేసిపెట్టాలి. నాకో ప్యాంటూ, షర్టూ తెచ్చిపెట్టాలి. ఇక పైజామా శేర్వానీ వేసుకోలేను."

"ఎక్కడికైనా వెళ్ళాలా?'

"ఇవ్వాళ కాదులే."

"ఇవ్వాళ్లసలు షాపులు తెరుస్తారో లేదో తెలీదు... కావాలంటే నా ప్యాంటూ షర్టూ ఇస్తాను."

ఇంతలో నన్నెవరో బైట్నించి పిలిచారు. నేను చప్పున లేచి బెడ్‌రూం తలుపులు బైటినించి గడియ వేసి, వీధి గుమ్మం తలుపు తెరిచాను. ఇద్దరు బస్తీ పెద్దమనుషులు నిలుచుని వున్నారు. సరాసరి డ్రాయింగ్ రూమ్‌లోకొచ్చి కూచుని ముస్లింలనీ, రజాకార్లనీ, ఖాసిం రజ్వీని చెడామడా తిట్టటం మొద లెట్టారు. నాకు చాలా ఇబ్బందిగా వుంది. దిలావర్ ఎక్కడ వినిపోతాడోనని.

"అంత తొందరపడకుండి. ఇంకా రాజ్యం మన చేతుల్లోకి రాలేదు" అన్నాను మెల్లిగా.

''ఇంకా భయపడ్తారేంవిటండీ? చచ్చిన పేన్లయ్యారు వెధవలూ."

"అదే అంటున్నాను. చచ్చిన పామును ఇంకా ఎందుకు చావగొడ్తారని."

"అమ్మా, వీళ్ళను నమ్మొద్దు. ఈ పాములకు నిలువెల్లా విషం."

"పోన్లెండి, వాళ్ళ పాపాన వాళ్లే పోతారు."

"ఏవింటో, ఇవ్వాళ్ళ మీరేదో అదోలా వున్నారు. ఉత్సాహంగా లేరు... వస్తాం" అంటూ లేచి చక్కా వెళ్లిపోయారు.

ఆరోజు దక్షిణ భారతదేశ చరిత్రలో సువర్ణాక్షరాల్లో లిఖించదగ్గ దినం! మూడు వందల యాభై సంవత్స రాల క్రితం మొఘల్ సామ్రాజ్యం క్షీణదశలో అవత రించిన ఆసఫియా రాజ్యం అంతరించిన దినం. వంద లాది సంవత్సరాలుగా పదిశాతం ముస్లింలు తొంభై శాతం ముస్లిమేతరులపై చలాయిస్తున్న అధికారం అంతమొందిన దినం!

సరిగ్గా మధ్యాహ్నం మూడు ఝాములకు హైద్రా బాద్ నగరంలో అడుగుపెట్టింది భారత సైన్యం.

మిలటరీ ట్రక్కులూ, టాంకులూ కంటపడగానే, ఇళ్లలో దాక్కుని వున్న ప్రజలు తండోప తండాలుగా వీధుల్లోకొచ్చి, ఝండాలతో సుస్వాగతం చెప్పారు. ఇన్నాళ్ళూ మాటపోయిన గొంతులు ఎలుగెత్తి నినాదాలు చేశాయి. భారత్ మాతాకీ జై! సర్దార్ పటేల్‌కీ జై! జవహర్‌లాల్ నెహ్రూకి జై! స్వతంత్ర భారత్ జిందాబాద్! అన్న నినాదాలు మిన్నుముట్టాయి. నేనూ ఉత్సాహంగా వెళ్ళి వేడుక తిలకిస్తూ నిలుచున్నాను. అంతమందిలోనూ ఒక ముస్లిమూ కనిపించలేదు.

ఆ రాత్రి ఏడింటి నుంచి కర్ఫ్యూ విధించారు. వీధులన్నీ నిర్మానుష్యమైపోయాయి. సాయుధ పోలీసులూ, సైనిక దళాలు మాత్రం గస్తీ తిరుగుతున్నాయి. నేను ఇంట్లోనే డ్రాయింగ్ రూంలో రేడియో దగ్గర కూచున్నాను. ప్రక్కనే దిలావర్ వున్నాడు. అతని మొహం చాలా గంభీరంగా వుంది. విషాద ఛాయలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

రేడియోలో మొదట మేజర్ జనరల్ చౌదరి ముక్తసరిగా మూడు నిమిషాలపాటు మాట్లాడాడు. అందులో ఎక్కువ భాగం హెచ్చరికలే వున్నాయి. ఆ తర్వాత మరో మూడు నిమిషాలు నిజాం మాట్లాడాడు. అందులో కొంత భాగం భారత ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలపటమూ, మరికొంత భాగం 'తన' ప్రజల్ని శాంతంగా వుండమని కోరటంతో సరిపోయింది. నిజాం మాట్లాడుతూన్నప్పుడు దిలావర్ మొహం విపరీతంగా మారింది. పళ్ళుకొరుకుతూ, పిడికిళ్ళు బిగిస్తూ కూచున్నాడు. ఆ కోపంలో లేచి నా రేడియో ఎక్కడ బ్రద్దలు కొడతాడోన్నంత భయం వేసింది. ప్రసంగం ముగిశాక చాలాసేపటికి గాని మామూలు మనిషి కాలేదు.

ఇద్దరంలేచి మౌనంగానే భోంచేశాం. పడుకున్నాం.

రెండో రోజు నాస్తా చేసేప్పుడు అడిగాడు. "నువ్వి వాళ్ళ ఆఫీసుకెళ్తున్నావా?"

"వెళ్తాను."

"వెళ్ళకు"

"ఏఁ?"

"నువ్వు నాకు రెండు మూడు పన్లు చేసిపెట్టాలి."

"ఏఁవిటి?"

"చెబుతా, మొన్న నీకిచ్చిన డబ్బు మూట ఇలా తే."

తెచ్చాను.

"ముడి విప్పు"

విప్పాను. అందులో నోట్ల కట్టలూ, విడిగా మరో నగల మూట వున్నాయి.

"రూపాయిలు లెఖ్ఖపెట్టు."

పెట్టాను. మూడువేల పై చిల్లర హాలీ(నిజాం) కరెన్సీలో వున్నాయి. నగల మూట విప్పొద్దన్నాడు. విప్పలేదు.

అందులోంచి కావలసినంత డబ్బు తీసుకుని, నాకు ఓ వెయ్యి రూపాయల కల్దార్ (భారత) కరెన్సీ నోట్లు తెచ్చి పెట్టాలి. నాకో ప్యాంటూ, షర్టూ, ఖద్దర్ ధోతీ, లాల్చీ, గాంధీ టోపీ కొనుక్కురావాలి. ఆఁ మరో ముఖ్యమైన పని కూడా వుంది. ఆజంపురాలో నా భార్య వుండే ఇంటికీ, గౌలిగూడలో మా మావయ్య ఇంటికి వెళ్ళి నాకోసం పోలీసు లెవరైనా వచ్చారేమో జాగ్రత్తగా తెలుసుకు రావాలి. ఏఁ?"

సరేనని లెఖ్ఖపెట్టి పన్నెండొందలు జేబులో పెట్టుకుని, తక్కింది మళ్ళీ మూటకట్టి అల్మారాలో భద్రపరిచాను.

ముందు బ్యాంకుకెళ్ళి డబ్బు మార్చాను. ఆ తర్వాత ఆజంపురా కెళ్ళాను. అక్కడ ముస్లింలే ఎక్కువుండేవారు. దివాళా తీసినట్టు బోసిగా వుంది. రోడ్లంబటి మనుషులు, అదీ మగవాళ్ళే. బహు కొద్దిమంది కనిపించారు. ఇళ్ళ తలుపులన్నీ మూసి వున్నాయి. దిలావర్ ఇంటి తలుపులు కూడా మూసి వున్నాయి.

తిన్నగా వెళ్ళి తలుపు దగ్గిర నిలుచుని, ఇక్కడి ఆచారం ప్రకారం చప్పట్లు చరిచాను. కొద్దిసేపటికి లోపల్నించి "ఎవరదీ?" అన్న మగ గొంతు వినిపించింది.

"నా పేరు స్వామీ. దిలావర్ హుసేన్‌గారి స్నేహితుణ్ణి" అన్నాను. మరికొంత సేపటికి తలుపులు తెరుచుకున్నాయి. అడ్డంగా ఒక గోనె సంచి పరదావేసి వుంది. ఒక రెక్క మూసేసి, గుమ్మంలో నిలుచుని నన్నే అనుమానంగా చూస్తున్నాడు ఒకతను. ఆజానుబాహువు, కోలమొహం. చామనఛాయ. ప్రాయం పాతిక ముప్ఫై మధ్య వుంటాడేమో గళ్ళలుంగీ కుర్తా వేసుకున్నాడు.

"దిలావర్‌గారు ఉన్నారా" అన్నాను.

"లేరు... నల్లగొండలో వున్నారు."

"తెలుసు, కాని వచ్చారేమోననీ... వారి జాడేమైనా తెలిసిందా?"

"....ఉహుఁ, తెలీలేదు."

"మీరూ...?"

"దిలావర్‌గారి భార్య నాకు చెల్లెలి వరుస."

"ఓహో..!... ఈ రెండు రోజుల్నించి మీరిక్కడే వుంటున్నారా?"

"అంటే?"

"ఏం లేదు. దిలావర్‌గారి కోసం ఎవరైనా వచ్చారేమోననీ."

"ఎవ్వరూ రాలేదు, మీరే మొదటివారు."

"అలాగా... సరే, దిలావర్ వస్తే నేనొచ్చి వెళ్ళానని చెప్పండి వస్తా" అంటూ వచ్చేశాను.

గౌలిగూడాలో దిలావర్ చినమాంవయ్య నన్ను చూడగానే ఆప్యాయంగా కౌగలించుకుని తీసికెళ్ళి డ్రాయింగ్ రూమ్‌లో కూచోబెట్టాడు. టీ తెప్పించాడు. నాకంటే ముందు ఆయనే అడిగేశాడు. "దిలావర్ కనిపించాడా?" అని.

"లేదే... ఇక్కడికి రాలేదా?"

"ఇక్కడికా?... ఇక్కడి కెప్పుడూ రాడు."

"ఆజంపురా కెళ్ళొచ్చాను. అక్కడికీ రాలేదుట."

"ఆ పాడుముండ మాట ఎత్తకండి. దాని మూలానే మావాడు చెడిపోయాడు" అన్నాడు కోపంగా.

నేను కాసేపు మాట్లాడలేదు.

"అయితే, నల్లగొండలోనే వుండి వుంటాడు" అన్నాను.

"ఉహుం, అక్కడా లేడు"

"మీకెలా తెలుసు?"

"అక్కడ నా స్నేహితులు కొందరున్నారు. వాళ్ళ ద్వారా వాకబు చేశాను. యూనియన్ సైనిక దళాలు నల్లగొండ చేరిన రెండో రోజే వాడి ఇంటిమీద పడ్డారట. కొల్లగొట్టారట. కాని వాడు మాత్రం చిక్కలేదట. అంతకు క్రితమే పారిపోయేడేమో."

"మరింకేం ఎక్కడో అక్కడ సురక్షితంగానే వుండి వుంటాడు."

"ఉహుం... నాకు నమ్మకంలేదు. ఎక్కడికని పారిపోతాడు? పట్టుపడే వుంటాడు. ఏం చేశారో ఏమో..." కంఠం రుద్ధపోయింది. "వాడిని మా చేతులు మీదుగా పెంచాం. ఈ రెండు రోజులూ వాడి గురించే కుమిలి కుమిలి పోతూన్నాం."

ఆయన దుఃఖం చూసి, నిజం చెప్పేద్దామని నోటి దాకా వచ్చింది. కాని దిలావర్ చేసిన హెచ్చరిక జ్ఞాపకం వచ్చి మానుకున్నాను. "విచారించకండి. పట్టుబడ్డాడని నిర్ధారణగా తెలియనప్పుడు సురక్షితంగానే వున్నాడనుకోవాలి. సరే, వస్తా" అంటూ లేచాను.

"మీరు వారి జాడ తెలిస్తే నాకు వెంటనే తెలియజేస్తారు కదూ?"

"తప్పకుండా" అంటూ వచ్చేశాను.

ఇంటికొచ్చి, సంగతంతా చెప్పి, కల్దార్ నోట్లు దిలావర్ చేతిలో పెట్టాను. "వెయ్యి రూపాయలు లెఖ్ఖ పెట్టుకో."

"అఖ్ఖర్లేదు" అంటూ తన జేబులో కుక్కుకున్నాడు.

"ఇదిగోం పన్నెండువందల్లో ఈ ముప్ఫై మూడు రూపాయలు మిగిలాయి."

"ఏంం? నేను చెప్పిన గుడ్డలు కొనలేదా?"

"లేదు... కావాలంటే నా ప్యాంటూ, షర్టూ ఇస్తానన్నానుగా... ఎన్నడూ తొడగని ఖద్దరు ధోతీ, లాల్చీ వెయ్యడం మంచిదికాదు. అలాంటి వేషాల్లో పారిపోజూసిన వాళ్ళను రైళ్ళలోంచి దించి ధోతులు ఊడబెరికి, ముస్లింలేనని తేలితే, నానా హింసలు పెడుతున్నారని విన్నాను. నువ్వలాంటి పిచ్చి ప్రయత్నం చెయ్యటం ప్రమాదకరం."

దిలావర్ మారు మాట్లాడకుండా తలవంచుకుని సుదీర్ఘంగా ఆలోచిస్తూ కూచున్నాడు. కాసేపటికి పక్కమీదికి వొరిగిపోతూ, "కనీసం బనియన్లూ, అండర్‌వేర్లూ, కాళ్ళకు చెప్పులైనా తీసుకు రాకపోయావా?" అన్నాడు. సరేనని మళ్ళీ బజారుకెళ్ళి అవన్నీ తెచ్చాను.

ఆ రోజు సాయంత్రం దిలావర్ బాగా మాసిపోయిన గడ్డం గీక్కున్నాడు. దాంతోబాటు గుబురుగా వున్న మీసాలు కూడా తీసేశాడు. ఎందుకలా చేశావని నేనడగలేదు. నా ప్యాంటూ షర్టూ అడిగి వేసుకుని కాస్త చీకటిపడ్డాక ఒక గంటలో వస్తానని ఎటో

## అమ్మ

**చం**దమామ రావే
జాబిల్లి రావే అనే పాటలతో
పసితనం నుంచి
లాలించి.. బుజ్జగించి
పెద్దచేసి... / దారి చూపించిన అమ్మని
రుణం తీర్చుకోకుండా / కుంటిసాకులతో
పంచుకుంటున్న ఈ సమాజంలో
అమ్మ అనే అమృత పదానికి
అర్థం తెలిసే రోజులు
ఎప్పుడు వస్తాయో!

**-కె. వి. శేషగిరిరావ్**

వెళ్ళిపోయాడు.

గంటకాదు. నాలుగ్గంటల తర్వాత వచ్చాడు. భోంచేసే వచ్చానని చెప్పి వెంటనే పడుకున్నాడు. మేమేమీ మాట్లాడుకోలేదు.

మరుసటిరోజు నేను ఆఫీసుకెళ్ళాను. దిలావర్ ఇంటిలోనే వున్నాడు. సాయంత్రం నేనొచ్చాక, తయారై బయలుదేరాడు. ఎక్కడికని అడిగితే, ఇప్పుడిప్పుడే చెప్పనన్నాడు.

ఆ రాత్రికి అసలు రాలేదు. తెల్లవారాక వచ్చి నాష్టా చేసి, పడకవేశాడు. నేను ఆఫీసుకెళ్ళిపోయాను. మళ్ళీ శుక్రవారం వచ్చేదాకా అలాగే జరిగింది.

ఆ రోజు నాకు శలవు. ఇంటిలోనే వున్నాను. దిలావర్ స్నానం చేసి తానే కొనుక్కుని తెచ్చుకున్న కొత్త ప్యాంటూ, షర్టూ వేసుకుని, పదకొండు గంటలప్పుడు బయలుదేరాడు. నాకు ఆశ్చర్యం వేసింది. "దిల్లూ! ఇప్పుడు బయటికెళ్తున్నావా?" అన్నాను.

అవును మక్కా మస్జిద్‌కు నమాజ్ చదవటానికి వెళ్తున్నాను. బహుశ నేను ఆ మస్జిద్‌లో నమాజ్ చదవటం ఇదే ఆఖరిసారేమో" అంటూ, నా రెండు చేతులూ తన చేతుల్లోకి తీసుకుని ఒక్క క్షణం నా కళ్ళలోకి నిశితంగా చూసి, మరో ప్రశ్నకు తావివ్వకుండా వెళ్ళిపోయాడు. నేను చూస్తూ వుండిపోయాను.

ఆ వెళ్ళటం వెళ్ళటం దిలావర్ మళ్ళీ రాలేదు. అతను విడిచి వెళ్ళిన డబ్బూ, నగలూ అలాగే వున్నాయి. ఏంచెయ్యాలో తోచలేదు. పదిరోజుల తర్వాత ఒక ఉత్తరం వచ్చింది.

## చలమెవ్వరిది?

కవిత్వంలో ఖాళీలుంటాయి
వచనంలో అవి పూరించబడతాయి
కవిత్వం కళకు నిలయం
వచనం దానిచుట్టూ వలయం
కవిత్వం వంకరి టింకరి పో
వచనం సూటిగా పో
కవిత్వం సామాజిక స్పృహ
వచనం సామాజిక న్యాయం
కవిత్వం కొందరిది
వచనం అందరిది
శ్రీశ్రీకి రావిశాస్త్రికి మధ్య చలమెవ్వరిది

—కవేరా

కథానిలయం
శ్రీకాకుళం

"డియర్ స్వామీ!

నేనలా చెప్పా చెయ్యకుండా వచ్చేసినందుకు క్షమించు. చివరిసారిగా నిన్ను కావలించుకోలేకపోయాననీ, అమ్మకు నమస్కారమైనా చెయ్యలేకపోయాననీ బాధగా వుంది. కాని ఏం చెయ్యను, అకస్మాత్తుగా కొన్ని పరిస్థితులు అనుకూలించటంతో, ఏకాయకీని వచ్చేయాల్సి వచ్చింది. ఆ వారం రోజులూ నువ్వూ, అమ్మా నన్ను కడుపులో పెట్టుకుని కాపాడారు. ఆ రుణం నేనీ జన్మలో తీర్చుకోలేను. అమ్మ చేసే కమ్మని వంటకాలు మళ్ళీ తినే అదృష్టం నాకుందో లేదో.

నేనిప్పుడు బొంబాయిలో వున్నాను. కాని నీకీ ఉత్తరం చేరేసరికి వుండను. కరాచీలో ఎక్కడో వుంటాను. పాకిస్థాన్‌లో కొత్త జీవితం ప్రారంభించటానికి పోతూన్నాను. తలచుకుంటేనే భయంగా వుంది. యూనివర్శిటీ నించి బయటపడ్డాక, జీవితంలో స్థిరపడడానికి నేనెన్ని కష్టాలు పడ్డానో నీకు తెలుసు. మళ్ళీ కథ మొదలుపెట్టాలి. ఇప్పుడు నా దగ్గర బి.ఏ. డిగ్రీ పత్రం కూడా లేదు. కేవలం అనామకుడిగానే అగాధంలోకి వెళుతున్నాను. నెగ్గుకొస్తానో లేదో చెప్పలేను. కాని వెళ్ళాలి. తప్పదు. బ్రతికి బట్టకట్టాలంటే వెళ్ళక తప్పదు. అక్కడే వుంటే నా రక్తం కళ్ళ చూసిందాకా వదలరు. అందుకే, నీలాంటి ప్రాణస్నేహితుల్ని కూడా వదిలేసి, ఇలా తెగించి పారిపోతూన్నాను.

ఆం నేను నీ దగ్గిర వదిలి వచ్చిన డబ్బూ, నగలూ నావి కావు. నా కష్టార్జితం కాదు. నేను నడిపించిన దాడుల్లో కొల్లగొట్టిన సొమ్మే. కొంత నల్లగొండ ఇంట్లో కూడా వుండిపోయింది. ఈ పాటికి దోచేసి వుంటారు.

మరి, దీన్నేం చేస్తావు? నా కోసం అట్టిపెట్టటం అవివేకం. మళ్ళీ మనం కలుసుకుంటామన్న నమ్మకం లేదు నాకు. కలుసుకున్నా, నాది కానిది నాకెందుకు? నా మాట వింటావా? నా పాత స్నేహితుడిగా, ప్రాణస్నేహితుడిగా నేనిచ్చే చివరి కానుకగా స్వీకరించావంటే నేనెంతో సంతోషిస్తాను. కాని, నీ సంగతి నాకు తెలుసు. నువ్వలా స్వీకరించవేమోనని నా అనుమానం. మరేం చేస్తావు. మా వాళ్ళకు ఇవ్వటానికి మాత్రం ప్రయత్నం చెయ్యకు. మా పెదమాంమయ్య చండశాసనుడు. ఆ పాపిష్టి సొమ్ము ముట్టుకోడు కూడాను. చెత్తకుండీలో పారేయిస్తాడు. ఇహపోతే నా భార్య వుంది... ఒరే స్వామీ! ఇన్నాళ్ళూ నీతో దాచిన నిజం చెబుతున్నాను. అది నా భార్య కాదు. ఉత్త రంకు ముండ. నువ్వానాడు చూసినవాడు దాని అన్న కాదు.

రంకుమొగుడు. నేను పెళ్లి చేసుకున్నప్పుడు దానికి అన్నలూ తమ్ములూ ఎవ్వరూ లేరు. వీడు ఎక్కడ్నుంచి దాపురించాడో, వాణ్ణి మరిగింతర్వాతే నాతో కాపరం చేయటం మానేసింది. ఆ దెబ్బకు తట్టుకోలేకేనేమో, మనశ్శాంతి కోల్పోయి, దోపిడీ దహనకాండల్లో కూరుకుపోయాను. విడాకులు ఇచ్చేసి, మా వాళ్ళ దగ్గరికి తిరిగి వెళ్ళి వాళ్ళు చేసే మరో పెళ్ళి చేసుకుందా మనుకున్నాను. కాని ఇంతలో ఈ పోలీస్ యాక్షన్‌తో అంతా తలక్రిందులైంది. ఇంతకూ నేను చెప్పొచ్చేదేఁ విటంటే ఆ ముండకు ఒక పైసా చెందకూడదు. తెలిసిందా? ఇహ మిగిలిన వారసుడివి నువ్వొక్కడివే. అందుకే నువ్వే తీసుకొమ్మంటున్నాను. అఁ పిచ్చి, పిచ్చిగా ఆలోచించి, వాటిని అసలుదారులకు అంద జెయ్యాలని నల్లగొండకు వెళ్ళకు సుమా. అనవసరమైన చిక్కుల్లో పడతావు. జాగ్రత్త. అవి ఎవరివో నాకే తెలీదు. వాళ్ళు బ్రతికున్నారో లేదో అంతకన్నా తెలీదు.

నా ఉనికి మరెవ్వరికీ తెలీనివ్వకు. మాఁవయ్య కనిపిస్తే మాత్రం చెప్పు. వాళ్ళకు కొంత ఊరట కలుగు తుంది.

బ్రతికుంటే మళ్ళీ కలుసుకుంటామేమో. అంత వరకు శలవు. ఉంటాను.

నీ ప్రియ స్నేహితుడు

**దిల్లు**

ఆ ఉత్తరం చదవగానే నా మనసు కుదుట పడ్డది. నా స్నేహితుడు సురక్షితంగా తన దారి తాను చూసుకున్నాడని సంతోషం కలిగింది. కాని నన్నే ఓ పెద్ద సందిగ్ధావస్థలో ముంచిపోయాడు. తాను వదిలి వెళ్ళిన ధనాన్ని వదిలించుకునే దారులన్నీ మూసేసి నేనే దానికి వారసుణ్ణని తేల్చాడు. కాని అది అసం భవం. అందులోంచి ఒక చిల్లి గవ్వ కూడా నేను తీసుకోలేను.

ఏముందో చూద్దామని మూట తీసి చూశాను. రెండువేల దాకా నగదూ, చిన్నచిన్న బంగారు నగలూ వున్నాయి. ముక్కుపుడకలూ, కమ్మలూ, చెంపసరాలూ, నాగరాలు, జడకుప్పెలూ, మెడగుండ్లూ, గొలుసులూఁ ఉంగరాలూ ఇంకా నాకు పేర్లు తెలియనివి అనేకం వున్నాయి. బహుశా నలభై, యాభై తులాలదాకా వుం డొచ్చు బంగారం. దిలావర్ రాసినట్లు అన్నీ పల్లెటూరు వాళ్ళవే. వాళ్ళే వీటికి అసలు వారసులు. వాళ్ళకే తిరిగి ముట్టాలి. కాని ఎట్లా? అదే తోచలేదు. ఎంత ఆలోచిం చినా పరిష్కారమార్గం కనిపించలేదు.

ఇంతలో నాకో వార్త తెలిసింది. మా బంధువుల్లో ఒకాయన యూనియన్ మిలటరీతోపాటు వచ్చిన సివిల్ టీంలో నల్లగొండకు తహసీల్దారుగా వచ్చాడని ఆయనే ఏదో దారి చూపిస్తాడన్న నమ్మకంతో, ఆ మూట తీసుకుని బయలుదేరాను.

ఆయనకు కథంతా చెప్పాను. ఉత్తరం మూటా ఆయన చేతి కందించాను. ఉత్తరం ఆసాంతం చదివి, మూట విప్పాడు. అందులోని డబ్బూ, బంగారం చూడగానే ఆయన కళ్ళు జిగేలున మెరిశాయి. తిరిగి మూట ముడివేసి ఉత్తరం చేత తీసుకుని, "ఈ ఉత్తరం ఎంత ప్రమాదకరమైందో నీకు తెలుసా?" అన్నాడు.

"నేనే పాపమూ ఎరుగను" అన్నాను.

"అని మీరనుకుంటున్నారు. ఒక నేరస్తుడికి వారం రోజులపాటు ఆశ్రయమిచ్చారు. దేశం నించి పారిపోవ టానికి దోహదమిచ్చారు."

"కాదు, అది నిజంకాదు, అతను పారిపోతాడని నాకు తెలీనే తెలీదు."

"కావచ్చు. కాని మీరు రుజువు చెయ్యలేరు. దీన్ని నాకు చూపించారు కాబట్టి సరిపోయింది. మరొహరి చేతిలో పడితే ఏమయ్యేదో..." అంటూ ఆగిపోయాడు.

నేనాయనకేసి భయంగా చూస్తూ, "అందుకే మీ దగ్గరికి వచ్చాను" అన్నాను.

"మంచి పని చేశారు. మీరు మాకు బంధువులు. మీకు హాని కలుగకుండా చూడటం నా ధర్మం. నా మాట విని ఈ ఉత్తరాన్ని వెంటనే కాల్చేయండి. మీ దగ్గిర వుండటం మంచిది కాదు."

"అలాగే కాని ఈ డబ్బు, నగలూ..."

"వీటి సంగతి నాకు వదిలేయండి. ఇలాంటివి మనకు చాలా చేరుతున్నాయి. అసలు వారసులొచ్చి రుజువు చూపించి తీసుకెళ్ళుతున్నారు. వాటిలో వీటిని కూడా కలిపేస్తాను. మీ పేరు పొక్కనివ్వను. మీరు నిశ్చింతగా వుండండి" అంటూ చిన్నగా నవ్వాడు.

ఆయనకు నా కృతజ్ఞతాభివందనాలు అర్పించి సంతృప్తిగా ఇంటికి తిరిగి వచ్చేశాను.

ఆ తర్వాతర్వాత తెలిసింది. సివిల్ టీమ్‌లో వచ్చిన మహాశయులంతా రామాయణంలో కిష్కింధాపుర నివాసుల వారసులనీ, రావణుడి మరణానంతరం లంకను కొల్లగొట్టినట్టే ఇక్కడి ప్రాంతాన్నంతా దోచు కున్నారనీ, తమ చేతికందినదల్లా వీలైనంతమట్టుకు తామే స్వాహా చేశారనీ, అప్పటినుంచి ఇక్కడ ఇచ్చి పుచ్చుకునే ఆచారం ప్రబలంగా ప్రాకిందనీ... ■